

ఉచితంగా ఎముకల పటుత్వ పరీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు: డాక్టర్ పెంచలమ్మ 3వ వర్ధంతిని పురస్కరించుకొని ఈ నెల 4వ తేదిన ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని 'డాక్టర్ పెంచలమ్మ వైద్యశాల'లో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ బి.నరేంద్రరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచితంగా వైద్యసేవలంది స్తామన్నారు. ఎముకలు, కీళ్లు, నరాలు, వెన్నుపూస సమస్యలు, గర్భకోశ వ్యాధుల సమస్యలు, షుగర్, బి.పి.థైరాయిడ్, విషజ్వరాలు, దంత సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా చికిత్సలు అందజేస్తామన్నారు. ఈ వైద్యశిబిరంలో జనరల్ ఫిజీషియన్ నిపుణులు డాక్టర్ శ్రీరామ్ కుమార్, గైనకాలజిస్టు ఎం.మేఘనరెడ్డి, దంతవైద్యనిపుణులు కె.విజయ నిర్మలరెడ్డి, ఎడ్వొకేట్ ప్రవళిక పాల్గొని వైద్యసేవలందించనున్నారు. అపాయింట్‌మెంట్ కోసం 6300923033 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

డాక్టర్ నరేంద్రరెడ్డి

'ఆట'ను అమ్మేస్తున్నారు..!

క్రీడలు మానసిక వికాసానికి కేంద్రాలు, క్రీడల అభివృద్ధికోసం ఎంతో చేస్తున్నామని, ఏదో చేశామని ప్రభుత్వాలు చెబుతున్నాయి. దేశంలోనూ, రాష్ట్రంలోనూ క్రీడలు వెనుకబడ్డాయి. పాఠశాలల నుంచి క్రీడా మైదానాలు అందుబాటులో లేవు. ఒక వేళ ఉన్నా క్రీడా పరికరాలు ప్రభుత్వం సమకూర్చడం లేదు. ప్రయివేటు వ్యక్తులు, పూర్వపు విద్యార్థుల సహకారంతో అక్కడక్కడా అభివృద్ధి చేస్తున్నారు. ప్రభుత్వం క్రీడా రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఇలాంటి సమయంలో ప్రస్తుతం శాప్ ఆధ్వర్యంలో నడుస్తోన్న క్రీడా సాధికారిత సంస్థలోని పలు క్రీడలను ప్రయివేటీకరణ చేస్తున్నారు. నెల్లూరు ఏసి స్టేడియంలో స్విమ్మింగ్‌ఫూల్ ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టారు. షటిల్ ఇండోర్ కోర్టు, ఇతర క్రీడా విభాగాలను ఇవ్వనున్నట్లు తెలిసింది. మొత్తం క్రీడా ప్రాంగణాన్ని మొత్తం ప్రయివేటీకరించే దిశలో ఏర్పాట్లు సాగుతున్నట్లు

◆దశల వారీగా ప్రయివేటీకరణ
◆తీవ్రంగా వ్యతిరేకిస్తున్న క్రీడాకారులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రభుత్వం ప్రయివేటీకరణను అన్ని శాఖల్లో వేగవంతం చేస్తుంది. ప్రభుత్వ రంగంలో నడుస్తోన్న అనేక విభాగాలు ప్రయివేటు వ్యక్తులకు అప్పగిస్తోంది. ప్రస్తుతం క్రీడా సంస్థలను ప్రయివేటీకరించడానికి చకచక ఏర్పాట్లు చేస్తుంది. విజయవాడ కేంద్రంగా శాఫ్ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ స్టేడియాలను ప్రవేటు వ్యక్తులకు ఇవ్వనున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 13 ఇండోర్‌స్టేడియాలు లీజుకు ఇచ్చారు. ప్రతి జిల్లా నుంచి రూ.25 లక్షల వసూళ్లు చేయాలని టార్గెట్ పెట్టినట్లు తెలుస్తోంది. నగరంలో 52 షటిల్ బ్యాడ్మింటన్, 10 టెన్నిస్ కోర్టులు, 4 స్కేటింగ్‌లు రెండేళ్లకు లీజుకు ముట్టచెప్పినట్లు సమాచారం. దీనికే పే అండ్ పే అంటున్నారు. డబ్బులు చెల్లించి క్రీడా మైదానంలో అడుగుపెట్టాలి. నెల్లూరు నగరంలోని ఏసి స్టేడియం ఎందరో వాకర్లకు, ఉపయోగ పడుతోంది. నగరంలోని అనేక మంది ప్రతి రోజూ ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు వివిధ రకాల క్రీడలు ఆడుతున్నారు. గత ప్రభుత్వాలు, కొందరు అధికారులు ప్రత్యేక చొరవతో ఏసి స్టేడియం ఎంతో అభివృద్ధి చెందింది. ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ ఫూల్, వాల్‌బాల్‌కోర్టు, ఖోఖో కోర్టు, బాస్కెట్ బాల్ కోర్టు ఇలా అనేక మైదానాలు అభివృద్ధి చెందాయి. ఇక్కడ నుంచి శిక్షణ పొందిన అనేక మంది విద్యార్థులు మంచి స్థాయిలో ఉన్నారు. క్రీడల ద్వారానే అనేక మంది ఉద్యోగాలు సాధించారు. రాష్ట్ర స్థాయి శిక్షణ కేంద్రాలు ఇక్కడ ఉన్నాయి. ఏసి స్టేడియంకు రాష్ట్ర స్థాయిలోనే మంచి గుర్తింపు ఉంది. అలాంటి స్టేడియాన్ని దశల వారీగా ప్రయివేటీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. క్రీడలను, క్రీడాకారులకు తాము ఏదో చేస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంది. క్రీడల అభివృద్ధికి నిధులు ఖర్చు చేయడం లేదు. కనీసం లైట్స్ కూడా కొత్తవి వేసుకోడానికి అవకాశం లేకుండా ఉంది.

దశలవారీగా ప్రయవేటీకరణ..!

రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ (శాప్) అభివృద్ధిని పక్కన పెట్టి అమ్మకానికి పెద్ద పీట వేస్తుంది. అందులో భాగంగా నగరంలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలోని పలు విభాగాలను ప్రయివేటు వ్యక్తులకు ఇస్తున్నారు. ఇక్కడ అధికారులకు ఏ మాత్రమూ తెలియకుండా శాప్ నుంచే నోటిఫికేషన్లు ఇస్తున్నారు. ఏసి స్టేడియం 21 ఎకరాల్లో ఉండగా ప్రస్తుతం 17 ఎకరాలుంది. ఇప్పటికే స్విమ్మింగ్‌ఫూల్‌ను ప్రయివేటీకరించినట్లు తెలుస్తోంది. ఇక్కడ పెద్దలకు నెలకు రూ.1000 వసూళ్లు చేస్తున్నారు. ఏడాదికి రూ. 8500 ప్రభుత్వం ఇప్పటికే వరకు తీసుకుంది. దీనిని లీజుకు ఇవ్వడంతో నగరంలోని మరో స్విమ్మింగ్ ఫూల్ నిర్వాహకులు లీజుకు తీసుకున్నట్లు సమాచారం. ఇండోర్ స్టేడియంలో 10 బ్యాడ్మింటన్ కోర్టు లున్నాయి. ప్రతి నెల ఒక్కొక్కరికి రూ.1000 వసూలు చేస్తున్నారు. అడ్వాన్స్‌ఫీజు కింద ఒక్కొక్కరికి రూ.5 వేలు తీసుకుంటున్నారు. దీనినిలీజుకు టెండర్లు పిలిచినట్లు తెలిసింది. క్రీడాకారులు పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తున్నారు. భవిష్యత్తులో మిగిలిన క్రీడా ప్రాంగణాన్ని లీజుకు ఇవ్వడానికి శాప్ సిద్ధమైంది. ఈ నిర్ణయాన్ని క్రీడాకారులు, ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నారు. శుక్రవారం డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సంతకాలు సేకరణ నిర్వహించారు. క్రీడాకారులు పాల్గొని నిరసన తెలిపారు.

సమస్యల పరిష్కారానికే సిఐటియు పోరాటం

11,12 తేదీల్లో ఆత్మకూరులో జిల్లా మహాసభలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు: ఉద్యోగ, కార్మిక సమస్యల పరిష్కారం సిఐటియు పోరాటం చేస్తుందని, ఈ నెల 11, 12 రెండు రోజుల పాటు ఆత్మకూరులో జరిగే సిఐటియు జిల్లా 11వ మహాసభల్లో సమస్యల సాధనకు చేయాల్సిన పోరాటాల శ్రీకారం చుట్టను న్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాల యంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా 11వ మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు చేపట్టిన పోరాటాలపై ఈ మహాసభల్లో సమీక్షలు నిర్వహించుకుంటా మన్నారు. ముఖ్యంగా మున్సిపల్ కార్మికులు, విద్యుత్తు రెగ్యులేటరీ చట్టం 2020కి వ్యతిరేకంగా పోరాటం, స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని ఆందోళన, ఆర్‌టిసి పేరుకు ప్రభుత్వ రంగంలో కలిపినప్పటికీ ఉద్యోగులకు, కార్మికులకు గతంలో కంటే ఎక్కువ సమస్యలు పెరిగాయని వాటి సాధనకు సిఐటియు జిల్లాలో అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. ఈ పోరాటాల వల్ల సాధించిన విజయాలపై సమీక్షిం చనున్నట్లు తెలిపారు. ఈ మహాప్రదర్శన ఆత్మకూరు లోని ఆర్‌టిసి డిపో నుంచి ప్రారంభమౌతుందన్నారు. అనంతరం బహిరంగ సభ జరుగుతుందని, ఈ సభకు మాజీ శాసనసభ్యులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ ప్రధాన వక్తగా వ్యవహరిస్తున్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి.సూరిబాబులు మాట్లాడారు. ఈ మహాసభలకు జిల్లాలో పనిచేస్తున్న వివిధ రంగాలకు చెందిన కార్మికులు అధిక సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

పదిరోజుల్లో ప్రభుత్వ శాఖల్లో ఖాళీపోస్టులు భర్తీ

ప్రజాశక్తి-నెల్లూరు: జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను పది రోజుల్లోగా భర్తీ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ నూతన ముఖ్య కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి కలెక్టర్‌ను కెవిఎన్ చక్రధర్‌బాబును ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన తొలిసారిగా రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టుల భర్తీ, విద్యా వైద్యం, పేదలందరికీ ఇళ్ల భూసేకరణ, ధాన్యం సేకరణ, వివిధ ప్రభుత్వ భవనాల నిర్మాణం, స్పందన కార్యక్రమం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు చాలా ముఖ్యమైన కార్యక్రమమని, నిర్ణీత లక్ష్యం మేరకు గృహ నిర్మాణ పనులు పూర్తి చేసి ఈ నెలలో ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలన్నారు.

మాట్లాడుతున్న జవహర్‌రెడ్డి

ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పులు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ముఖ్యంగా మాతా శిశు మరణాలు నివారించేందుకు అన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు.

12,13 తేదీల్లో చంద్రబాబు రోడ్‌షో

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి: టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు రెండు రోజులు జిల్లాలో పర్యటించనున్నారు. ఈనెల 12,13 తేదీల్లో రెండు రోజులు నాలుగు లేదా ఐదు నియోజకవర్గాల్లో రోడ్‌షోలు ఉండేలా టిడిపి నేతలు రూట్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఆయన పర్యటన వాయిదాపడింది. బాదుడే బాదుడు రావాల్సి ఉండగా, వర్షాలు కారణంగా జరగలేదు. ఇప్పుడు "ఇదేం ఖర్మ...మన రాష్ట్రానికి " అనేక కార్యక్రమం ద్వార ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 6న టిడిపి జిల్లా సమన్వయ కమిటీలో చంద్రబాబు రూట్ మ్యాప్ ప్రకటించనున్నారు. జిల్లాలో నాలుగు లేదా ఐదు నియోజక వర్గాల్లో కార్యక్రమం ఉండేలా నేతలు చూస్తున్నారు. నెల్లూరులో పార్టీ బలహీనంగా ఉందని, పార్టీనేతల మధ్యసఖ్యత లేదని జరుగుతోన్న ప్రచారం. ఇక్కడ జరుగునున్న ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసి, పార్టీ బలంగా ఉందని చెప్పుకోడానికి నేతలు చూస్తున్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి: ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పిఎంజికెవై) పథకం ద్వార నిరుపేదలకు డీలర్ షాపుల ద్వార బియ్యం పంపిణీ చేస్తున్నారు. కరోనా సమయంలో పేదల ఆకలి తీర్చడానికి, రైతల నుంచి ధాన్యం కొనుగోలు చేసి రైతులకు చేయూత అందించాలనే ఉద్దేశంతో ఈ పథకం ప్రవేశపెట్టారు. 1965లో ఏర్పాటు చేసిన ఎఫ్‌సిఐ అప్పటి నుంచి రైతుల నుంచి ధాన్యం, కొనుగోలుచేసి, రైతులకు మద్దతు ధర కల్పిస్తుంది. ఆహార ధాన్యాన్ని గిడ్డంగుల్లో భద్రపరిచి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వార ప్రతి పేదవాడికీ బియ్యం అందిస్తున్నారు. ప్రస్తుతం 7వ విడత కార్యక్రమం జరుగుతోంది. అందులో ఇప్పటి వరకు 26 వేల టన్ను సివిల్ సప్లయ్‌కు అందజేసినట్లు అధికారులు తెలిపారు. 2020 నుంచి 2022 వరకు 6 దశల్లో అమలు చేశారు. నిర్దిష్ట గడువు పూర్తి చేస్తామని ఎఫ్‌సిఐ నెల్లూరు డివిజన్ మేనేజర్ ద్రిగ్‌పాల్ సింగ్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సందీపన్ సర్కార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇప్పటికే వివిధ సెక్షన్ ప్రజలను ఈ పథకం ద్వార ఐదు కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేసినట్లు తెలిపారు.

వక్ఫ్‌బోర్డు మెంబరుగా సంధాని

ప్రజాశక్తి -కందుకూరు: షేక్ సంధానీ బాషాకి వక్ఫ్ బోర్డ్ మెంబర్‌గా నియమించినందుకు స్థానిక శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక వైసిపి కార్యాలయంలో మాట్లాడారు. ఎపి ప్రభుత్వం చేత నియమించబడినటువంటి వక్ఫ్ బోర్డు మెంబర్ సందాని బాషా, వక్ఫ్ బోర్డ్ ఇతోధిక అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వక్ఫ్ బోర్డ్ జవసత్వాల కోసం పనిచేయాల్సి ఉంటుందని సూచించారు. సందాని భాష మాట్లాడుతూ తన నియామకానికి కషిచేసిన ఎమ్మెల్యే మానుగుంట మహిధర్ రెడ్డికి కతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు, ముస్లిం మత పెద్దలు, వైసిపి వివిధ పదవుల్లో ఉన్న ముఖ్య నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్య.కా.సం.మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుడ్లూరు: వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభలు డిసెంబరు 8,9, 10తేదీలలో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జరుగుతాయని. ఈ మహాసభలు జయప్రదం చేయాలని, కోరుతూ ఎంఎస్‌ఆర్ గిరిజన కాలనీ లో వ్యవసాయ కార్మిక సంఘం జెండాను రాపూరి మాల్యాద్రి ఎగుర వేశారు. ఈ సంధర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు, యాకసిరి వెంకయ్య, కొమ్మి మాల్యాద్రి, సిహెచ్. మల్లికార్జున, శారద, అశోక్, ఐద్వా కార్యదర్శి సుంకర విజయ లక్ష్మి పాల్గొన్నారు.

ఎన్‌జిఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా 'మన్నేపల్లి'

ప్రజాశక్తి-నెల్లూరు: ఎపి ఎన్‌జిఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా మన్నేపల్లి పెంచలరావు (వైద్య ఆరోగ్యశాఖ), అసోసియేట్ అధ్యక్షులుగా నందిమండలం ఆంజనేయవర్మ (వైద్య ఆరోగ్యశాఖ)లు ఎన్నికయ్యారు. శుక్రవారం నగరంలోని ఎన్‌జిఓ భవన్‌లో అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నికకు ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలకు అధికారిగా గుంటూరు జిల్లా అధ్యక్షులు గంటశాల శ్రీనివాసరావు వ్యవహరించారు. జిల్లా కార్యవర్గానికి 15 పోస్టులు ఉండగా నామినేషన్లు ముగిసే సమయానికి 15 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు పరిశీలించిన ఎన్నికల అధికారి జి.శ్రీనివాసరావు ఎపి ఎన్‌జిఓ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎకగ్రీవంగా ఎంపికైనట్లు ప్రకటించారు.

మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు

'ఇదేమి ఖర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి-గుడ్లూరు: రాష్ట్రాన్ని గొప్పగా అభివద్ధి చేస్తానని చెప్పి ఓట్లు వేయించుకున్న జగన్మోహన్ రెడ్డి, ఆదాయం సష్టించలేక అప్పులు కుప్పగా మార్చి వేశారని కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తపేట గ్రామంలో శుక్రవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలు ఏయే సమస్యలను ఎదుర్కొంటున్నారో తెలుసుకుంటూ ముందుకు సాగారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాజీ శాసనసభ్యులు దివి శివరాం తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ అప్పు చేయకుండా ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తే పరిస్థితి కూడా లేదన్నారు. కార్యక్రమంలో జనిగర్ల నాగరాజు, జాజుల కొండయ్య, శింగమనేని సుబ్బారాయుడు, పులి ప్రభావతి, రత్తయ్య, గొత్తుల మాధవి, గోచిపోతల కల్పన, బొబ్బూరి నాగేశ్వరరావు, పువ్వాడి వేణుగోపాల్, తదితర నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి -కందుకూరు: గుడ్లూరులో ఆరు కుటుంబాల వారు వైసీపీని వీడి గురువారం రాత్రి తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన కొండాబత్తిన మాల్యాద్రి, గద్దె రాజు, బెల్లంకొండ వీరభద్రం, గద్దె రామలింగయ్య, కొమరగిరి వెంకటేశ్వర్లు, కొమ్మి అంకయ్య ఆధ్వర్యంలో పలువురు కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో పార్టీలో చేరారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి.. కార్యక్రమంలో భాగంగా వీరంతా పార్టీలో చేరగా, నాగేశ్వర రావు వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పువ్వాడి శ్రీనివాసులు, స్థానిక నాయకులు రావూరి వేణు, పువ్వాడ వేణు, దామా వెంకటేశ్వర్లు, ఉన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-నెల్లూరు: రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సంయుక్త సహాయ సహకారాలతో స్థానిక 12వ డివిజన్ పెద్ద చెరుకూరు, ఎస్.టి.కాలనీలో కాలువలు, రోడ్డు నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు నగర మేయర్ స్రవంతి జయవర్ధన్ శంకుస్థాపన చేశారు. శుక్రవారం అభివృద్ధి పనుల శంకుస్థాపనకు హాజరైన మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన రూ.20 లక్షల సచివాలయ నిధులతో ఈ పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు..కార్యక్రమంలో 12వ డివిజన్ స్థానిక నాయకులు, ప్రజలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయండి

ప్రజాశక్తి-నెల్లూరు: నగర పాలక సంస్థ పరిధిలో జనాభాకు తగ్గట్టుగా యువతను ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టామని కమిషనర్ హరిత తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఓటర్ల నమోదుపై బూత్ లెవెల్ అధికారులుగా నియమితులైన సచివాలయ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమీక్షలో భాగంగా నగర పాలక సంస్థ పరిధిలోని ఓటర్లు - జనాభా నిష్పత్తి, లింగ నిష్పత్తి, కొత్త ఓటర్ల నమోదు, వివిధ క్లైమ్‌ల పరిష్కారం, గత ఓటర్ల జాబితాతో నేటి జాబితా పోలిక, యువ ఓటర్ల తగ్గుదలను భర్తీ చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, నగర తహాశీల్దార్ నిర్మలానంద బాబా, సెక్రటరీ హేమావతి, ఈ.డి.టి శైలజ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

అధునాతన బ్రేకర్ ఏర్పాటు

ప్రజాశక్తి -ఉలవపాడు: 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో టౌన్ ఫీడర్‌కు అధునాతన టెక్నాలజీ గల నూతన బ్రేకర్‌ను శుక్రవారం ఏర్పాటు చేశా రని స్థానిక అసిస్టెంట్ ఇంజినీర్ నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా ఏఈ నరసింహారావు మాట్లాడుతూ గతంలో ఉన్న ఉలవపాడు టౌన్ ఫీడర్ బ్రేకర్ అకస్మాత్తుగా చెడిపోయి, మరమ్మ తులకు కూడా అను కూలంగా లేకుండా పోయిం దన్నారు. దీంతో ఏడు లక్షల వ్యయంతో నూతన టెక్నాలజీ గల అధునాతన బ్రేకరును యుద్ధప్రాతిపదికన ఏర్పాటుచేసి పట్టణ వాసులకు నిరంతర కరెంటు సరఫరాకు ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రొ టెక్షన్ ఏఈ సురేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనా రాయణ, లైన్ మ్యాన్ రాజా, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లను వినియోగించొద్దు

ప్రజాశక్తి -కందుకూరు: కందుకూరు పురపాలక సంఘ పరిధిలో గల హెరీల్సేల్ ప్లాస్టిక్ విక్రయదారులతో కమిషనర్ ఎస్ మనోహర్ ఆధ్వర్యంలో నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సమావేశం ఏర్పాటుచేశారు. సదరు సమావేశంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఒకసారి వినియోగించి తీసివేయు ప్లాస్టిక్ ను సంపూర్ణంగా నిషేధించడమైనదని తెలిపారు. వ్యాపారస్తులు నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించినా, విక్రయించిన వీధి వ్యాపారస్తులకు మొదటి సారిగా జరిమానా రూ. 2500లు, 2వ సారి జరిమానా రూ.5000లు విధించబడునని తెలిపారు. షాపుల యజమానులకు మొదటిసారి జరిమానా రూ.20వేలు, 2వ సారి జరిమానారూ. 40,వేలు విధిస్తూ స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ వస్తువులకు కే.జీ రూ.10ల చొప్పున అదనంగా పెనాల్టీ విధించబడునని తెలిపారు. లైసెన్సు రద్దు చేసివారి పై ప్రాసిక్యూషన్ చేయబడునని తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి -కందుకూరు: విద్యా రంగంలో అనేకమైన సమస్యలు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక యుటిఎఫ్ ఆఫీస్‌లో ఎస్ఎఫ్ఐ మండల మహా సభ మెండా. శ్రీహర్ష అధ్యక్షతన జరి గింది. మహాసభ కి ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి శ్రీనివాసులు పాల్గొ న్నారు. ఆయన మాట్లాడుతూ విద్యా రంగంలో అనేకమైన సమస్యలు ఉన్నా యన్నారు. వాటిని వెంటనే ప్రభుత్వం పరిష్కరిం చాలన్నారు. అనం తరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శి సాగర్, అధ్యక్షులు విజయ్, సహాయ కార్యదర్శి రాజ్ కుమార్, ఎస్కె సల్మా, సూర్య, ఉపాధ్యక్షులు సల్మాన్ రాజ్,రవి వర్మ, కోషాధికారి అరుణ్ కుమార్, కమిటీ సభ్యులు గణేష్, అశోక్, ఆకాష్ ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న శ్రీనివాసులు

పాఠశాలలో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-పొదలకూరు: స్థానిక జెడ్‌పి బాలుర పాఠశాలలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. సిఐ పెంచల్ రెడ్డి విద్యార్థులకు పెడుతున్న భోజనం తిని నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి వివరాలు ఆరా తీశారు. నాణ్యత ప్రమాణాలపై సంతప్తి వ్యక్తం చేసినట్లు హెచ్‌ఎం సనత్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు, తదితరులు

ప్రజాశక్తి-నెల్లూరు: ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలనికలెక్టర్ చక్రధర్ బాబు పిలుపునిచ్చారు శుక్రవారం జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా జగనన్న పచ్చ తోరణం లో భాగంగా అదాని కష్ణపట్నం పోర్టులో మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్క లను నాటి పర్యావరణ పరిరక్షణకు కషి చేయాలన్నారు. ఆదాని కష్ణపట్నం పోర్టు ఒక్కరోజు వెయ్యి మొక్కలను నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. అందుకు పోర్టు యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ముందుగా పోర్ట్ అధికారులు కలెక్టర్ చక్రధర్ బాబుకి ఘన స్వాగతం పలికారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కషి చేస్తామని కలెక్టర్‌తో పాటు పోర్టు ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. మొదటిగా కలెక్టర్ పోర్ట్ ఆవరణలో మొక్కలు నాటారు. ఇప్పటికే ఆదాని కష్ణపట్నం పోర్టులో మొక్కల పెంపకం నిర్వహిస్తున్న ప్పటికీ నిర్విరామంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతుండడం హర్షనీయమన్నారు. జిల్లాలో అటవీ ప్రాంతం అభివద్ధికి వన్ సిటిజన్ వన్ ట్రీ అనే నినాదంతో మొక్కలు నాటడం జరగాలని దీంతో ఒక ఏడాదిలో 26 లక్షల మొక్కలు నాటేందుకు కషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి పాఠశాల, కళాశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులచే మొక్కలు నాటించే కార్యక్రమం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మోహిత్ శకావత్ అడ్మిన్ హెడ్ గణేష్ శర్మ, అశోక్ కుమార్ మిశ్రా, వేణుగోపాల్ రెడ్డి, హెచ్‌ఆర్ డీజీఎం శ్రీనివాస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సిహెచ్ రాజశేఖర్, ఫైనాన్స్ హెడ్ శ్రీకాంత్, వివిధ విభాగాలు హెచ్‌ఒడిలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

భారీ వాహనాల ప్రవేశం నిషేధించాలి

ప్రజాశక్తి-నెల్లూరు: నగరంలో భారీ వాహనాల (యాష్ పాయింట్ లారీలు) ప్రయాణాన్ని నిషేదించి ప్రజల ప్రాణాలను కాపాడాలంటూ సిపిఎం 16వ డివిజన్ శాఖ నిరసన కార్యక్రమం చేపట్టింది. శుక్రవారం నగరంలో ముత్తుకూరు సెంటర్లో స్థానిక సిపిఎం నాయకులు కాయం శ్రీనివాసులు, సుధాకర్ తదితరు నాయకత్వంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమ నిర్వహణను పోలీసులు అడ్డుకొనే ప్రయత్నం చేశారు. సిపిఎం నాయకులు సమస్యను పోలీసుల దృష్టికి తీసుకెళ్ళి శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఈ ప్రాంతం నుంచి ప్రతినిత్యం భారీ వాహనాలు ప్రయాణించడం వల్ల రహదారులు పూర్తిగా ధ్వంసం అయిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అంతే కాకుండా మితిమీరిన వేగంతో ప్రయాణించడం వల్ల ప్రజలు ప్రమాదాలకు గురౌతున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా పోలీసు అధికారులు, ట్రాఫిక్ పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య వెంటనే పరిష్కరించకపోత సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలకు పిలుపునిస్తామని తెలిపారు కార్యక్రమంలో సిపిఎం నాయకులు సుధాకర్, మల్లపు నారాయణ, సంపూర్ణమ్మ, కుమారు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమం చేపడుతున్న సిపిఎం

పొదలకూరులోనే 'ఐసిడిఎస్' ఉండాలి

ప్రజాశక్తి-పొదలకూరు: పొదలకూరులో దశాబ్దాలుగా ఉన్న పొదలకూరు ప్రాజెక్టు ఐసిడిఎస్ కార్యాలయాన్ని రాపూరుకి మార్పు చేయడం పట్ల వ్యతిరేకిస్తూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు శుక్రవారం మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. మూడు మండలాల అంగన్వాడీ కార్యకర్తలు ప్రాజెక్టు మీటింగ్స్‌కు రాపూరు వెళ్లాల్సి వస్తుందని, అది ఎంతో దూర ప్రయాణమని వాపో యారు. ఐసిడిఎస్ కార్యాల యం మార్పు చేయడం ఆపా లని మంత్రి కాకాణిని వారు కోరారు. ఆయన వెంటనే స్పం దించి ఖచ్చితంగా పొదలకూరులోని ఐసిడిఎస్ కార్యాలయం ఉండేలా చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలి పారు. కార్యక్ర మంలో పి. స్వర్ణలత, ప్రమీల, సుధా, రోహిణి, జయలక్ష్మి, మాధురి, పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కాకాణి

అధికారులు సహకరించాలి : ఎంపిపి

ప్రజాశక్తి-ఉదయగిరి : ప్రభుత్వ లక్ష్యాలు, స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులు సహకరించి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిపి మూలే పద్మజ వినయ్ రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధే లక్ష్యంగా మండలంలో ఎక్కువగా ఉన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపాలన్నారు. సర్వసభ్య సమావేశంలో సమస్యలు తెలపడం తప్ప పరిష్కారంలో అధికారులు విఫలం అవుతున్నారని ప్రభుత్వ లక్ష్యాలకు ప్రతి అధికారి సహరించాలన్నారు. స్థానిక పలు గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్యలు విద్యుత్ స్తంభాల సమస్యలు నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నాయని వెంటనే పరిష్కరించాలని జిల్లా కో ఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్ కోరారు. అలాగే జెడ్‌పిటిసి మోడీ రామాంజనేయులు మాట్లాడుతూ అప్పసముద్రం గ్రామానికి మండల నిధులతో రోడ్డు నిర్మించి గ్రామ విద్యార్థుల ప్రజల సమస్యలను తీర్చాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి కొళాయి పథకం హామీ తప్ప పనులు శూన్యం అని దుయ్యబట్టారు. ఎప్పుడు చేపడతారని ఆర్డబ్ల్యుఎస్ అధికారులను ప్రశ్నించారు. స్పందించిన అధికారులు రెండు రోజులలో చేపడతామన్నారు. అనంతరం పలు గ్రామపంచాయతీ సర్పంచులు గ్రామాల్లోని సమస్యలను వివరించారు. సొసైటీ అధ్యక్షులు మూలే వినయ్‌రెడ్డి, ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్, తహశీల్దార్ నాసా శ్రీనివాసులు రెడ్డి, ఎంఇఒ షేక్ మస్తాన్ వలీ, ఇఒపిఆర్‌డి ఇ.లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షురాలు మట్ల శాంతి, ఎంపిటిసిలు గొల్లపల్లి తిరుపతయ్య, సుభాన్, మండల కో ఆప్షన్ మెంబర్ సుభాని సర్పంచులు సామ్రాజ్యం, గౌస్ మొహిద్దీన్, కృష్ణ, తిరుపతి, వరలక్ష్మి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-కావలి : ఘోర రోడ్డు ప్రమాదంలో ఎముకలు విరగడంతో తీవ్రంగా గాయపడిన కావలి చెందిన చిలకా తిరుపతికి, వైద్య ఖర్చులకు శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో విద్యార్థులు సేకరించిన రూ.25,350లను శుక్రవారం అతని బంధువైన కిరణ్‌కు అందించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ పి.జానకిరామ్ మాట్లాడుతూ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు ఒకటై సేవా దృక్పథంతో స్పందించి, ఆర్థికసాయం అందించడం చాలా అభినందనీయమని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపల్ పి.వి.రావు మాట్లాడుతూ విద్యార్థులకు మొదటి నుంచి నైతిక విలువలతో కూడిన విద్యను అందించడం వల్ల విద్యార్థులు ఇటువంటి సేవా కార్యక్రమాలల్లో పాల్గొంటున్నారని తెలిపారు. అనంతరం విరాళాలు సేకరించిన విద్యార్థులు ఎన్.అమరేశ్వరి, యు.వెంకటేశ్వరి, సిహెచ్.హేమలత, జి.మానస, జె.అవినాష్, జె.అజయ్, పీవీ.సురేష్, శ్రీరాములు, నాగరాజు, అనిల్, పృథ్వి, జాశ్వలను అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ పి.వి.రావు, రవికాంత్, అధ్యాపక బృందం కాంతారావు, మొహమ్మద్ రఫీ విద్యార్థులున్నారు.

ఆహార పొట్లాలు అందజేత

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం నివాసి పోలీస్ కానిస్టేబుల్ షేక్.బాబుల్–రమీజాలి దంపతుల కుమార్తె చిన్నారి షేక్.సాఫియా పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో కావలి పట్టణం ఉన్న యాచకులకు ఎగ్ బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంయుక్త సేవాసంస్థ ద్వారా పేదలకు ఆకలి తీర్చిన దాతలు షేక్ బాబుల్–రమీజా దంపతులు తమ కుమార్తె పుట్టినరోజు సందర్భంగా ఆడంబరాలకు పోయివృథా ఖర్చులు చేయకుండా యాచకులకు ఆకలితీర్చడం సంతోషంగా ఉందని సంస్థ అధ్యక్షులు సురేంద్ర పేర్కొన్నారు.

18వ వార్డులో ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి-కావలి : స్థానిక 18వ వార్డులోని రామాలయాన్నికావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని సుబ్బానాయుడు ఆలయానికి విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కావలి పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆ భగవంతుని ప్రార్థించారు. ఈ ఆలయ పునర్‌నిర్మాణాన్ని చేపట్టిన టిడిపి ముఖ్య నాయకులైన శానం హరికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అయ్యప్ప స్వాముల వద్ద ఆశీర్వాదం పొందిన అనంతరం అక్కడ నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వీరితోపాటు రాష్ట్ర పార్టీ కార్యదర్శి మొగిలి కల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, పట్టణ ఉపాధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, జ్యోతి బాబురావు, ఏగూరి చంద్రశేఖర్, గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, మలిశెట్టి విజయలక్ష్మి, కావేటి శివకోటయ్య, కమ్మిశెట్టి రమణయ్య, పోలిశెట్టి మాలకొండయ్య, గుర్రాల వెంకటేశ్వర ప్రసాద్, నీలిశెట్టి రమణయ్య, భోగిశెట్టి సుబ్రహ్మణ్యం, భోగిశెట్టి రమేష్, కావేటి శివకుమార్, పాశం చంద్రశేఖర్, తిరుమల శెట్టి దుర్గా, పాశం కృష్ణ, ముద్దకొలను మాల్యాద్రి, కావేటి మహేష్, మొగిలి విజయకుమార్, లింగం మాల్యాద్రి, బ్రహ్మయ్య, రామారావు, సాయి, పులివర్తి రవీంద్ర, గొట్టిపాటి రాము, హరీష్, చంద్రశేఖర్, తిరుపాలు, వేణు తదితరులు ఉన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఎపి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.ఎస్.నవీన్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ శాఖ ద్వారా సార్ట్ (ఎస్‌ఎఆర్‌టిఎస్) సంస్థ శుక్రవారం ఆత్మకూరులో 'హెచ్ఐవి / ఎయిడ్స్'పై నాటక రూపంలో అవగాహన కల్పించారు. 'హెచ్ఐవి' అనేది నాలుగు మార్గాల ద్వారా వ్యాపిస్తుందని అవి వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. 1097 టోల్ ఫ్రీ కి కాల్ చేసి 'హెచ్ఐవి'పై సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని బాబురావు కళాబృందం వారు తెలిపారు. కార్యక్రమంలో సార్ట్ ప్రాజెక్టు మేనేజర్ జె.వెకోవియ, వర్మ, సిబ్బంది, సునీత, నీరజ, మాలిని, లోకల్ లీడర్ పులిగిలాల రెడ్డి, కౌన్సిలర్ దగ్గుబాటి శివకోటేశ్వర, శ్రీధర్ నాయుడు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

చేవూరు కిరణ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కావలి : మాజీ కౌన్సిలర్ చేవూరు తిరుమల కుమారుడు వైసిపి 12వ వార్డు ఇన్‌చార్జి చేవూరు కిరణ్‌కుమార్ జన్మదిన శుభాకాంక్షలు శుక్రవారం నిర్వహించారు. కుటుంబ సభ్యులు, అభిమానులు సమక్షంలో ఘనంగా ఆయన కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పందిటి కామరాజు, దేవరకొండ శ్రీనివాసులు, నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొని జన్మదిన వేడుకలు జరిపారు. కిరణ్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

గడపగడపకు మనప్రభుత్వం

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని లేగుంటపాడులో శుక్రవారం ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను గ్రామ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు దువ్వూరు బాలచంద్రారెడ్డి, డిఎవిబి చైర్మన్ దొడ్లపరెడ్డి నిరంజన్ బాబురెడ్డి, ఎంపిపి చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, జెడ్‌పిటిసి శ్రీలత, ఎంపిపి పార్వతి, శివుని నరసింహారెడ్డి, సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, నాలుబోలు సుబ్బారెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మండలంలోని నరసాపురం పంచాయతీ తూర్పు గిరిజన కాలనీలో శ్రీ పోలేరమ్మ అమ్మవారి నూతన దేవాలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీలలిత భరద్వాజ దత్త పీఠం శ్రీ లలిత మహేశ్వరీ ఆశ్రమ పీఠాధిపతి, అఖిల భారత హిందూ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీశ్రీశ్రీ రామయణం మహేష్ స్వామి విచ్చేసి భూమి పూజ కార్యక్రమం చేపట్టారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-కొడవలూరు : బుచ్చిరెడ్డిపాలెం మండలం వవ్వేరు గ్రామంలో గిరిజన కాలనీలో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వాణి ట్రస్ట్ ఆర్థిక సహాయంతో సమరత సభ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన శ్రీరామ మందిర నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ కొటంరెడ్డి లలిత రెడ్డి మాట్లాడుతూ మందిర నిర్మాణానికి సహకరించిన ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కోటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మహిమలూరు వెంకటరామయ్య, ఎస్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.టి జనార్ధన్, సభ్యులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల విద్యాశాఖ అధికారి వారి కార్యాలయంలో ఎంఇఒ షేక్.మస్తాన్ వలీ మండలంలోని అన్ని స్కూల్ కాంప్లెక్స్‌లకు సంబంధించిన సిఆర్‌పిలకు టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ మెటీరియల్ టీచింగ్ కార్యక్రమానికి సంబంధించిన మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ 3,4,5 తరగతులు అభ్యసించే విద్యార్థులలో పఠన సామర్థ్యాలు, నైపుణ్యాలు పెంపొందించే ఉద్దేశంతో ఉపాధ్యాయులకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని ముందుగానే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన మెటీరియల్‌ను అన్ని పాఠశాలలకు సంబంధించిన సిఆర్‌పిలకు ఇస్తున్నట్లు, నాటి నుండి ఈ టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ మెటీరియల్ ఆధారం సిఆర్‌పిలు మండలంలోని అన్ని పాఠశాలలకు సరఫరా చేయాలని తెలియజేశారు. ఈ బోధనా మెటీరియల్ ద్వారా 3,4,5 తరగతులు అభ్యసించే విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలు, నైపుణ్యాలు పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు బోధించాలని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ కార్యాలయ సిబ్బంది, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

నిందితురాలు అరెస్టు

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని తూర్పు బోయమడుగులలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను శుక్రవారం సెబ్ అధికారులు అరెస్ట్ చేశారు. ఆమె వద్ద 12 మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రవీంద్రబాబు, సచివాలయ మహిళా పోలీస్ నాగమణి, సబ్ కానిస్టేబుల్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ నోటిఫికేషన్‌లో మార్పులు చేయాలి

ప్రజాశక్తి-కావలి

ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పోలీస్ కానిస్టేబుల్, ఎస్.ఐ.పోస్టుల నోటిఫికేషన్‌లో అభ్యర్థుల వయోపరిమితి, పోస్టుల సంఖ్య, గడువుతేదీలను పెంచాలని డివైఎఫ్ఐ పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో పట్టణ కార్యదర్శి పెంచలనరసింహ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్‌లో కేవలం 6100 కానిస్టేబుల్, 411 ఎస్ఐ పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందులో ఫైర్, జైలు వార్డెన్ పోస్టుల ప్రస్తావన లేదని, అభ్యర్థుల వయోపరిమితి, పోస్టుల సంఖ్యను పెంచాలని, పరీక్షల గడువు తేదీలను పొడిగించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు డిగ్రీలు, పీజీలు చేసి ఈ నోటిఫికేషన్ కోసం 4 సంవత్సరాలుగా ఎప్పుడెప్పుడని ఆశగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ ప్రకటన వారికి నిరాశే మిగిల్చిందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు సంవత్సరానికి 6700 ఎస్.ఐ., పోలీస్ కానిస్టేబుల్ పోస్టులను విడుదల చేస్తామని చెప్పి, మాట తప్పారు. మడమ తిప్పారు. అధికారంలోకి వచ్చి ఇప్పటికి మూడున్నర సంవత్సరాలు గడిచిందన్నారు. మూడు సంవత్సరాలకు గాను 20,100 పోస్టులు విడుదల చేయాల్సి ఉంటే, కేవలం 6511 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులకు అన్యాయం చేయడమేనని అన్నారు. రాష్ట్ర పోలీస్ శాఖ అధికారుల లెక్కల ప్రకారం అన్ని ఫోర్స్‌లలో దాదాపు 35శాతం ఖాళీ పోస్టులు ఉన్నాయన్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీస్ శాఖలోనే ఖాళీలు ఉండడం సిగ్గుచేటన్నారు. అమరవీరుల దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖలో సంస్కరణలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటూ వీక్లీ ఆఫ్ ప్రకటించిందని తెలిపారు. అది ఇప్పటి వరకు అమలు మాత్రం చేయడం లేదన్నారు. వీక్లీ ఆఫ్ అమలు చేస్తే సుమారు పదివేల మంది పోలీసులు అదనంగా అవసరం అవుతారు కాబట్టి వీక్లీ ఆఫ్ అమలు చేయడం లేదని విమర్శించారు. విడుదల చేసిన పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో అభ్యర్థుల వయోపరిమితి 35 సంవత్సరాలకు పెంచాలని, ప్రాథమిక పరీక్ష గడువు తేదీలను పెంచాలని డిమాండ్ చేశారు. 5వ తేదీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ నాయకులు పాశం కోటేశ్వరరావు, మోతే సాయికుమార్,అభి, తదితరులున్నారు.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

త్వరలోనే వైసిపి ప్రభుత్వానికి సమాధి

ప్రజాశక్తి - కావలి : వైసిపి ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పనున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం కావలి పి.హెచ్.ఆర్. కళ్యాణ మండపంలో జరిగిన "సిపిఐ జిల్లా జనరల్‌బాడీ సమావేశాని"కి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహాలను లబ్ధిదారులకు ఇవ్వడంలో ప్రభుత్వం వెనకాడుతున్నారన్నారు. అకాల వర్షాలవల్ల, పంటనష్టాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. ఇరిగేషన్ రంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేశారని తెలిపారు. అభివృద్ధి ఆగిపోయిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులకు కొత్త ప్రతిపాదనలు పంపవద్దని రాష్ట్ర ఫైనాన్స్ శాఖ అన్నిశాఖల సర్క్యులర్ పంపిందంటే ప్రభుత్వం వద్ద నిధులు లేవని బహిరంగంగా ఒప్పుకున్నట్టే అని తెలిపారు. లక్షలాది ఎకరాల్లో పంటనష్టం అయితే రైతులను ఆదుకోవడం లేదన్నారు. గోదావరి జిల్లాల్లో పంటబాగా పండిన చోట ధాన్యం కొనేదిక్కులేదన్నారు. పంటలు పండిన చోట, పండని చోట కూడా రైతాంగం పరిహారం కోరితే ప్రభుత్వం ఆదుకోలేనంతగా దివాళా తీసిందన్నారు. ఆక్వా రంగం తాము క్రాప్ హాలిడే ప్రకటిస్తామంటున్నారన్నారు. వాళ్లు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్డెక్కనున్నారన్నారు. ప్రభుత్వానికి లాభం తెచ్చే ఈరంగం కూడా నష్టపోయిందని విమర్శించారు. టీచర్లందరినీ పోలింగ్ డ్యూటీ లకు మినహాయింపు చేశామంటు న్నారని తెలిపారు. తమ ప్రభుత్వానికి టీచర్లు, ఉద్యోగు లు వ్యతిరేకంగా ఉన్నారని జగన్ భయపడుతు న్నాడన్నారు. జగనన్న ఇళ్ల పేరుతో ప్రజలను దగా చేస్తున్నారన్నారు. 12వ తేదీన సిపిఐ, రైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ధర్నాలు చేస్తామన్నారు. పేదలకు ప్రతి ఒక్కరికీ ఇళ్లు వచ్చేవరకు, టిడ్కో లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించేవరకు పోరాటాలు ఆపేదిలేదన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జగదీష్, జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, స్థానిక నాయకులు కొప్పర్తి నాగరాజు, చేవూరు కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాష్ట్ర మహాసభల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కావలి : 8,9,10తేదీలలో ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెంలో జరుగనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు మాల్యాద్రి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో వ్యకాసం ఆధ్వర్యంలో మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనర మాట్లాడుతూ భూసమస్యలు, వ్యవసాయ కార్మికులకు కనీసవేతనం, ఉపాధి హామీ పనులకు కనీసవేతనం తదితర సమస్యలపై రాష్ట్ర మహాసభల్లో చర్చించి తీర్మానాలు చేస్తారని తెలిపారు. రైతుసంఘం నాయకులు తిరుపాల్‌రెడ్డి, వ్యకాసం మండల కార్యదర్శి సీతారామయ్య, సిఐటియు నాయకులు కె.జాన్ పాల్గొన్నారు.

ఎస్‌పి విజయరావుకు సన్మానం

ప్రజాశక్తి-అల్లూరు : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు విచ్చేసిన జిల్లా ఎస్‌పి విజయరావు ను కావలి డిఎస్‌పి వెంకటరమణ శుక్రవారం ఆయనను మర్యాద పూర్వకంగా ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఇటీవల అనేక దోపిడీలు జరిగిన నేపథ్యంలో పోలీసు సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకొని నిందితులను పట్టుకోవడం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనల వల్ల పోలీసులపై ప్రజలకు నమ్మకం ఉంటుందని తెలియజేశారు. రూరల్ సిఐ రాజేష్, అల్లూరు ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి, ఎఎస్ఐ దాసు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-మర్రిపాడు : 11, 12వ తేదీలలో ఆత్మకూరు పట్టణంలో జరుగుతున్న సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి బి.రత్నయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సంధ్బంగా వారు మాట్లాడుతూ సిఐటియు మహాసభలకు మండలంలోని అసంఘటిత కార్మికులు మేధావులు, సానుభూతిపరులు, అభిమానులు, వేలాదిగా తరలి వచ్చి మహాసభను జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు మండల అధ్యక్షులు గుండు బోయిన శ్రీనివాసులు, సిపిఎం మండల కార్యదర్శి రహంతుల్లా, సిఐటియు సీనియర్ నాయకులు సూరి నారాయణ, భవనం మండల కార్యదర్శి జాన్సన్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులంటే ప్రభుత్వానికి భయం

ప్రజాశక్తి-కావలి : ఉపాధ్యాయులను ముఖ్యమంత్రి అనేక విధాలుగా ఇబ్బందులు పెట్టడం వల్ల ఉపాధ్యాయులలో ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడిందని, అందుకే రానున్న ఎన్నికల్లో ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుండి తప్పించేందుకు జగన్ ప్రయత్నిస్తున్నాడని జనసేన జిల్లా కార్యదర్శి సమ్మను వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగులకు ఒక్క డిఎ కూడా ఇవ్వలేదన్నారు. ఉపాధ్యాయులను తొలగించటం సాధ్యమయ్యే పని కాదని, ఎన్నికల కమిషనర్ సరైన నిర్ణయం తీసుకుంటుందన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కావలి

పట్టణంలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు శుక్రవారం ఆర్‌డిఒ వి.కె. శీనా నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు పట్టణ కార్యదర్శి ఎర్రంశెట్టి కృష్ణమోహన్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ కార్మికుల సమస్యలను పరిష్కరించడం లేదని, ఎన్నోసార్లు సమస్యలను పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. గతంలో పనులు చేస్తున్న కార్మికులకు కుటుంబ ఇబ్బందులు వచ్చినప్పుడు వేరే వారితో పనులు చేయించుకునే వెసులుబాటు ఉండేదన్నారు. అంతేకాకుండా కొబ్బరి నూనెలు, సబ్బులు, చెప్పులు, గ్లౌజులు, పనిముట్లు ఇచ్చేవారని, ఈయన వచ్చిన తర్వాత సక్రమంగా ఇవ్వడం లేదని విమర్శించారు. కార్మికులకు కుటుంబ ఇబ్బందులు కలిగినప్పుడు వారి కుటుంబ సభ్యులతో పనులు చేయించుకుంటామని అడిగినప్పటికీ అలా కుదరదని షరతులు చెబుతున్నాడని తెలిపారు. కార్మికుల ఇబ్బందులను గుర్తించి గతంలో అధికారులు కల్పించిన విధంగా కార్మికులకు వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. వారికి ఇవ్వాల్సిన వస్తువులు వెంటనే ఇవ్వాలని, ప్రస్తుత మున్సిపల్ అధికారులు కార్మికులపై దుర్మార్గంగా వ్యవహరిస్తూ ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.పెంచలనరసింహ, జి.మధుసూదన రావు, యూనియన్ నాయకులు తురక శీనయ్య, బిరదల మహేష్, కావలి యేసు, ఒంగోలు రమేష్, ఎస్.శివ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

నిందితులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కొడవలూరు : మండలంలోని వారం రోజులక్రితం గుండాలమ్మపాలెం వద్ద ఆర్‌టిసి బస్సును ఆపి డ్రైవర్‌పై మందుబాబులు దాడిచేశారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఇంతవరకు నిందితులను పట్టుక్కొకపోవడం దారుణమని, ఎపిఎస్ ఆర్‌టిసి రీజనల్ సెక్రటరీ రత్నాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఎపిఎస్ ఆర్‌టిసి ఎస్‌సి, ఎస్‌టి వెల్‌ఫేర్ అసోసియేషన్ సభ్యులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎపిఎస్ ఆర్‌టిసి రీజనల్ సెక్రటరీ రత్నాకర్ మాట్లాడుతూ నిత్యం ఎంతోమంది ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థాలానికి చేరుస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న ఆర్‌టిసి డ్రైవర్లకు కొడవలూరు మండలంలో రక్షణ కరువైందన్నారు. నవంబర్ 25న రాత్రి 10 గంటల సమయంలో చెన్నరాయుని పాలెం వెళుతున్న ఆర్‌టిసి బస్సును మద్యం మత్తులో ఉన్న ముగ్గురు యువకులు గుండాలమ్మపాలెం వద్ద ఆపి ప్రయాణికుల కళ్ల ముందు విధుల్లో ఉన్న ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడి చేశారన్నారు. దాడి జరిగిన వెంటనే కొడవలూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఫిర్యాదు చేసి వారం రోజులు అవుతున్నా దాడికి పాల్పడ్డ వారిపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే నిందితులను శిక్షించి ఆర్‌టిసి డ్రైవర్లకు న్యాయం చేయాలన్నారు. ఆర్‌టిసి ఎస్‌సి ఎస్‌టి వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆశీర్వాదం, వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, డిపో ప్రెసిడెంట్ శ్రీనివాసులు, డిపో సెక్రటరీ మురళి, డ్రైవర్ భాస్కర్ పాల్గొన్నారు.

రూ.528కోట్ల డిపాజిట్లే లక్ష్యం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో ఈ ఏడాది రూ.528 కోట్లు డిపాజిట్లు లక్ష్యంగా పెట్టుకొని ఇప్పటికీ రూ.415 కోట్ల టార్గెట్ సాధించామని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సిఇఒ డాక్టర్ చల్లా శంకర్ బాబు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకులో పలు రికార్డులను ఆయన పరిశీలించా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిపాజిట్ల మహోత్సవం నిర్వహిస్తున్నామని, 599 రోజులకు 7 శాతం వడ్డీ ఇస్తున్నామని తెలిపారు. సీనియర్ సిటిజన్లకు 71/2 వడ్డీ ఇస్తున్నామని తెలిపారు. మార్చి నెలాఖరకు ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేస్తామని తెలిపారు. సహకార అమృత్, సహకార ఉన్నత్ తదితర స్కీముల ద్వారా అధిక శాతం వడ్డీలు చెల్లిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా తమ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ స్కీముల గురించి ఆయన వివరించారు. బ్యాంకు మేనేజర్ సిహెచ్ శ్రీనివాస రావు, సుబ్బారెడ్డి, సూపర్‌వైజర్లు జనార్ధన్‌రెడ్డి, శేషయ్య, బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే ఆధార్ మొబైల్ క్యాంపు

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని సోమశిలలో త్వరలోనే ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తామని ఎంపిడిఒ మధుసూదన్ రావు తెలియజేశారు. ఈ క్యాంపులో ఆధార్ నమోదు, అప్డేట్, ఆధార్‌కు ఫోన్ లింక్, బయోమెట్రిక్ అప్‌డేట్ వంటివి చేస్తామన్నారు.

భూ రీ సర్వేపై వర్క్‌షాప్

ప్రజాశక్తి-వరికుంటపాడు : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో భూముల రీ సర్వేకు సంబంధించి శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించినట్లు రీ సర్వే స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీ ప్రసన్న తెలియజేశారు. వర్క్ షాపులో పాల్గొన్న విఆర్‌ఒలకు, విలేజ్ సర్వేయర్లకు పంచాయతీ కార్యదర్శులకు రీసర్వేపై పలు సూచనలు సలహాలు చేశామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ అబ్దుల్ హమీద్, డిప్యూటీ తహశీల్దార్ చేవూరి శ్రీనివాసులు, విఆర్‌ఒలు, విలేజ్ సర్వేయర్లు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఆక్సిజన్ కాన్సంట్రేటర్ వితరణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని గండ్లవీడు గ్రామంలో టిబి వ్యాధితో బాధపడుతూ 6యేళ్ల గిరిజన విద్యార్థినికి బిఎస్‌పి నాయకులు ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3 నెలలుగా ఆత్మకూరు, నెల్లూరు, తిరుపతి, చెన్నయ్ అన్ని హాస్పిటళ్లు తిరిగి కొంచెం కోలుకోగా ఇంటిదగ్గర సుమారు 3 నెలలు ఆక్సిజన్ అవసరమని బిఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షులు న్యాయవాది నంద ఓబులేసు దృష్టికి తెలిపారన్నారు. స్పందించిన ఓబులేసు మిత్రుడు హైదరాబాద్‌లో ఉన్న రమణా రెడ్డికి తెలియజేయగా స్పందించి రూ.55 వేల విలువ చేసే ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను అందజేశామన్నారు. బిఎస్‌పి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి కృష్ణ, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఆంద్రా కాంతారావు, టౌన్ అధ్యక్షులు ఆత్మకూరు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు శ్యామ్, తదితరులున్నారు.

'విజ్ఞాన విహార యాత్ర'

ప్రజాశక్తి - ఆత్మకూరు అర్బన్ : తెలుగు భారతి సేవాసమితి సభ్యులు విజ్ఞాన విహార యాత్రలో భాగంగా శుక్రవారం నేలపట్టు పక్షుల సంరక్షణ కేంద్రం నేలపట్టు, శ్రీహరికోటలోని మిషన్ మెయింటనెన్స్ సెంటర్, లాంచింగ్ మేయింటనెన్స్ సెంటర్‌ను సందర్శించారు. గౌరవ అధ్యక్షులు ఎస్ వి రమణయ్య, ప్రధాన కార్యదర్శి జీ. రామిరెడ్డి, పూర్వ అధ్యక్షులు సోమవరపు సుబ్బ రాయుడు, ఆర్థిక కార్యదర్శి ఒమ్మిన సుబ్రమణ్యం, వి.నారాయణ రావు, కొల్లా వెంకటేశ్వర్లు, శ్రీనివాస రాజు, ఎ.రఘురామిరెడ్డి, కె.రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

'ఇదేమి ఖర్మ రాష్ట్రానికి'..

ప్రజాశక్తి-కావలి

తెలుగుదేశం పార్టీ నూతనంగా ప్రారంభించిన ప్రచార కార్యక్రమం "ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమం కావలి నియోజక వర్గంలో కావలి పట్టణ 6వ వార్డులో శుక్రవారం నియోజకవర్గ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు లాంఛనంగా ప్రారంభించారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గుత్తికొండ కిషోర్‌బాబు, మన్నవ రవిచంద్ర, డాక్టర్ ఏగూరి చంద్రశేఖర్, మొగిలి కల్లయ్య, జ్యోతి బాబురావు, దావులూరు దేవకుమార్, పోతుగంటి శ్రీకాంత్, కావేటి చిన్నకోటయ్య, అక్కిలిగుంట సూర్యప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న మాలేపాటి సుబ్బానాయుడు

వైసిపి పాలనలో ప్రజలు భయాందోళన

ప్రజాశక్తి-ఉదయగిరి : సామాన్యులు విలన్‌ను చూసి భయభ్రాంతులకు గురవుతారని, అదేవిధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దుర్మార్గంగా అందిస్తున్న పరిపాలనపై రాష్ట్ర ప్రజలు భయాందోళన చెందుతున్నారని దుయ్యబట్టారు. శుక్రవారం స్థానిక రంగనాయకుల దేవస్థానం నుండి బస్టాండ్ సెంటర్ వరకు 'రాష్ట్రానికి ఇదేమి ఖర్మ' కార్యక్రమాన్ని మాజీ ఎంఎల్ఎ బొల్లినేని వెంకట రామారావు ప్రారంభించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన 27 లక్షల నిర్మించిన కాలనీలకు వైసిపి రంగులు వేసారే తప్ప ప్రజలకు పంచి పెట్టలేదని ధ్వజమెత్తారు. ఈ రాక్షస పాలనపై ప్రజలంతా ఐక్యమై మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపుమేరకు చేపట్టే ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి చెంచల బాబు యాదవ్, మండల కన్వీనర్ చింతన బోయిన బయన్న, మైనార్టీ నాయకులు రియాజ్, రైతు సంఘ నాయకులు బొజ్జ నరసింహులు, బిసి మండల అధ్యక్షులు బడబాగ్ని నరసింహారాజు, ఎస్‌సిసెల్ నాయకులు రాజా, రామ్మోహన్, మహిళా నాయకురాలు అరుణమ్మ, ఆమ్‌స్ట్రాంగ్ రాజు, టిడిపి మాజీ సర్పంచులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అక్షర చైతన్యం-2ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు రూరల్ మండలంలోని అక్షర చైతన్యం–2 ను విజయవంతం చేయాలని ఎంపిడిఒ సి.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు జగనన్న పచ్చతోరణం కింద అక్షర చైతన్యం–2లో నేర్చుకొనే అభ్యాసకులకు మొక్కలు పంపిణీ నిమిత్తం సంక్షేమ విద్యా సహాయకులకు మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ షేక్.నజీర్ బాషా ప్రసంగిస్తూ సంక్షేమ సహాయకులు శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆయుష్ మాన్ భారత్ సమావేశంలో పాల్గొన్న ఎఎన్‌ఎంలతో మాట్లాడుతూ అయుష్మాన్ భారత్ సర్వేలో ఆత్మకూరు మండలం జిల్లాలో ముందంజలో ఉండే విధంగా ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు కృషి చేయాలని ఎంపిడిఒ కోరారు. పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ సహాయకులు పాల్గొన్నారు.

దోచుకొని దాచుకోవడమే వైసిపి లక్ష్యం

ప్రజాశక్తి-లింగసముద్రం : వైసిపి నేతలు ప్రజల సొమ్మును దోచుకు తింటున్నారని కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు ఆరోపించారు. మండలంలోని పెదపవని గ్రామంలో, ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి.. కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి 420 టీంను చూసి పారిశ్రామికవేత్తలు భయపడుతున్నారని, తమకు వాటాలిస్తేనే పరిశ్రమలకు అనుమతులు ఇస్తామంటూ బెదిరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వేముల గోపాలరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య, నియోజకవర్గ ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ నాయబ్ రసూల్, స్థానిక నాయకులు డాక్టర్ నరసింహారావు, నీలం బ్రహ్మారెడ్డి ధనం మధు, నీలం మాధవరావు,షేక్ నాయబ్, పూరిమిట్ల మాల్యాద్రి, బొల్లినేని నాగేశ్వరరావు, దివి సౌభాగ్య, సోంపల్లి మనోహర్, గొల్లపల్లి వెంకటేశ్వర్లు, సుబ్బులు నాయుడు, కూరపాటి శ్రీనివాసులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మంచినీటి వసతి కల్పించరూ..!

- సర్పంచ్‌ను వేడుకున్న గిరిజనులు

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామంలో తిప్ప గిరిజన కాలనీలో గత మూడు నెలలుగా తాగుటకు నీళ్లలేక అల్లాడుతున్నామని గిరిజనలు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం గిరిజనులు మాట్లాడుతూ గ్రామ పంచాయితీ కార్యదర్శికు మంచినీళ్లు రావడం లేదని సర్పంచ్‌కు విన్నవించుకున్నట్లు తెలిపారు. ఆయన మంచినీటి పైపులు లాగుతున్నందువల్ల మంచినీరు ఇబ్బంది అయిందని, అందువల్ల ట్యాంకర్లు పంపిస్తున్నామని తెలిపారు. తమకు మాత్రం నాలుగు నెలల నుంచి తాగునీరు అందడం లేదన్నారు. పక్కన ఉన్న బావి, బోరులలో నుంచి నీళ్లు తెచ్చుకోవాలంటే ఒకటి రెండు బిందులు తప్ప ఐదో బిందెకి రావాలంటే కుళ్లలతో రంగు మారిపోయి వస్తున్నాయని తెలిపారు. ఈ విషయం పై ఎంపిడిఒను కలిసినా ఆయన పంచాయతీ కార్యదర్శికి తెలపగా ట్యాంకర్లతో పంపిస్తున్నామని అంటున్నారన్నారు. ఈ విషయంపై గ్రామ సర్పంచి భర్త దృష్టికి తీసుకెళ్తే మీరు ఉన్నతాధికారులకు చెప్తే మీకు నీళ్ల వస్తాయా అని వెటకారంగా మాట్లాడారని తెలిపారు. ఎంపిటిసి నాగరాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆ పరిసర ప్రాంతాలకు వెళ్లి పరిశీలించి వారితో మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరిస్తామని తెలిపారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ఆత్మకూరులో 11వ తేదీన జరిగే సిఐటియు జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి మారుబోయిన రాజా పిలుపు ఇచ్చారు. శుక్రవారం మండలంలోని నరుకూరు సెంటర్లో సిపిఎం మండల కార్యదర్శితో కలసి రాజా మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ఈ మహా సభలు ఈ నెల 11, 12 తేదీలలో జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా 11వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఆత్మకూరు ఆర్‌టిసి బస్టాండ్ నుంచి కార్మిక ప్రదర్శన సాగుతుందని తెలిపారు. ప్రదర్శన అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వద్ద భారీ బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు.కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు వేగూరు శంకరయ్య. నాశిన చెన్నయ్య, పడుగుపాడు రైల్వే గూడ్స్‌షెడ్డు ముఠా వర్కర్స్, యూనియన్ సభ్యులు, ఆటో యూనియన్ సభ్యులు, రోడ్ మార్జిన్ పువ్వుల వ్యాపారి జయమ్మ పాల్గొన్నారు.

మేకల అపహరణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-గుడ్లూరు : మండలంలోని రావూరులో మేకల అపహరణ పై బాధితురాలు బర్రె గోవిందమ్మ అదే గ్రామానికి చెందిన నల్లవుల శ్రీను పై స్థానిక పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. అర్ధరాత్రి సమయంలో రావూరు గ్రామానికి చెందిన శీను గోవిందమ్మకు చెందిన రెండు మేకలని తీసుకొని ఆటోలో వేసుకుని పారిపోయాడు. గమనించిన గోవిందమ్మ వెంటపడిన దొరకకపోవడంతో గ్రామానికి చెందిన సర్పంచ్‌కి తెలియజేసింది. సర్పంచి స్థానిక పోలీస్ స్టేషన్లో నిందితుడు పై ఫిర్యాదు చేయాలని చెప్పడంతో ఆమె పోలీసులు ఆశ్రయించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-రాపూరు : మండలంలోని పంగిలి గ్రామం లో శని, ఆదివారాలు రెండు రోజుల పాటు విఆర్ విత్ యూ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని ట్రస్ట్ నిర్వాహ కులు చరణ్ తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 20 రకాల వ్యాధులకు సంబంధించి పరీక్ష లు నిర్వహించి, మందులు అందిస్తామన్నారు.

సుందరంగా 'పులికల్లు'



ప్రజాశక్తి-పొదలకూరు : మండలంలోని పులికల్లు గ్రామపంచాయతీని పొదలకూరు ఎంపిడిఒ , ఇఒపిఆర్‌డి, ఎంఇఒ శుక్రవారం సందర్శించారు.ఒడిఎఫ్ గ్రామంగా గుర్తింపు పొందిన పులికల్లు "జగనన్న స్వచ్ఛ సంకల్పం"లో "విజువల్లీ క్లీన్‌లీ నెస్" అవార్డు పొందిన సంగతి అందరికీ విదితమే. జెఎస్‌ఎస్ ఇన్‌స్పె క్షన్‌లో భాగంగా ఎంపిడిఒ బృందం చెత్త నుండి సంపద తయారీ కేంద్రంను పరిశీలించి మొబైల్ యాప్ ద్వారా చెక్ చేశారు. సర్పంచ్ సుబ్బమ్మను, సెక్రటరీ మాధవిని కొనియాడారు. నాయకులను అభిషేషించారు. అంతా ఒక కుటుంబంలా పని చేస్తున్నారని, పంచాయతీని ముందుకు తీసుకెళ్లాలన్నారు. సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు, క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.

కుష్టు నివారణ కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-రాపూరు : కుష్టు వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా రాపూరులో ఎల్సిడిసి ప్రోగ్రామ్ ఆఫీసర్స్ తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో డిఎన్‌ఎంఒ డాక్టర్ కె.పవిత్ర, ఫిజియోథెరపీ డి.నరసింహులు పాల్గొన్నారు.

గెస్ట్ టీచర్‌కు అవకాశం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో గెస్ట్ టీచర్‌గా పని చేసేందుకు ఒకరికి అవకాశం ఉన్నట్లు ప్రత్యేకాధికారిణి జాగర్లమూడి గోవర్ధిని శుక్రవారం తెలిపారు. అర్హత కలిగిన వారు నేరుగా పాఠశాలలో సంప్రదించాలని, పూర్తి వివరాలకు 7702076044 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

IN THE COURT OF THE MACT CUM XI Addl Chief Judge City Civil Court AT: HYDERABAD, TELANGANA
O.P.NO 1369 OF 2022

Between:
Shaik Gouse Basha & Others
.... **Petitioners**
AND
Karthik Samadhi & Others
.... **Respondents**

To,
1. Karthik Samadhi S/o S. Venkataiah
Age:25 years, Occ: Bus Driver,
R/o Kkutur Venkaiah Colony,
Nellore-524320
......R1

Whereas the above named Petitioners have filed the above O.P. against you and another for grant of compensation under the M. V Act.
Please take notice that the above O.P. stands posted to 23-12-2022 for your appearance, you are required to appear before Hon'ble Court at 10: 30 am on the above date either in person or through and advocate, failing which the matter will be decided exparte

// BY ORDER OF THE COURT//
C. SATHISH KUMAR REDDY
ADVOCATE
Plot No : 36/1#3-125/36
Shanthinagar Colony, Uppal,
Hyderabad-39